క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరా నిలుపుదల

భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలోని వెల్లటూరులో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ పి.ఏడుకొండలు గురువారం తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కులగణనలో సమగ్ర సమాచారాన్ని పొందుపరచండి

కొల్లూరు : సమగ్ర కులగణన విషయంలో సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని కొల్లూరు ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్తు కార్యాలయంలో మాట్లాడుతూ.. ఈనెల 19 నుంచి 28 వరకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువు లోపు కులగణన పూర్తి చేయాలన్నారు. కొల్లూరు–1, 2, 3, దోనేపూడి, గాజుల్లంక సచివాలయాలకు ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు సమగ్ర కులగణనకు పర్యవేక్షక అధికారిగా వ్యవహరించనున్నారు. కిష్కింధపాలెం, పెసర్లంక, పోతార్లంక, జువ్వలపాలెం, ఈపూరులంక సచివాలయాలకు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు పర్యవేక్షక అధికారిగానూ, అనంతవరం, ఈపూరు, చిలుమూరు, రావికంపాడు, చినపులివర్రు, క్రాప సచివాలయాలకు ఈవోపీఆర్డీ సీహెచ్.రవిబాబు పర్యవేక్షక అధికారిగా వ్యవహరించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

నిర్వాసితులకు నిత్యావసర కిట్లు పంపిణీ



పల్లెకోన(భట్టిప్రోలు): భారత అభ్యుదయ సేవా సమితి (బాస్) ఆధ్వర్యంలో ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపాను కారణంగా నిర్వాసితులైన 100 కుటుంబాలకు గురువారం నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. రేపల్లె 22వ వార్డులో 75 కుటుంబాలకు, సూర్యలంక, రామాపురంలోని 80 కుటుంబాలకు నిత్యావసరాల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ కోఆర్డినేటర్ చుక్కా జోసఫ్ ఆంథోని, పల్లెకోన ఆర్గనైజర్ నూతక్కి జస్వంత్‌రాజ్, నూతక్కి అరుణరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఐలవరం(భట్టిప్రోలు): ఇటీవల రోడ్డు ప్రమాదం పాలై మృతి చెందిన భట్టిప్రోలు మండలం ఐలవరానికి చెందిన దివి మోహన కృష్ణ (27) కుటుంబానికి పద్మశాలీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బాసటగా నిలిచింది. నిరాశ్రయురాలైన మృతుని భార్య లక్ష్మీ హిమబిందుకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు స్వర్గం పుల్లారావు, సెక్రటరీ కన్నా మాస్టార్, కోశాధికారి నీలి కనకదుర్గాప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

కోడి పందేలరాయుళ్ల అరెస్టు



గుంటూరు రూరల్: కోడి పందేలరాయుళ్లను అరెస్ట్ చేసిన సంఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... స్టేషన్ పరిధిలోని ఓబులునాయుడుపాలెం శివారుల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న స్పెషల్ బ్రాంచి పోలీసుల సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్న 10 మంది, కోడితో పాటు రూ. 1.82 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

ఉపాధి హామీ పథకంతో జీవనానికి భద్రత

చేబ్రోలు: ప్రతి ఆర్థిక సంవత్సరంలో కనీసం వంద రోజుల వేతన ఉపాధితో పాటు గ్రామీణ ప్రాంత కుటుంబాల జీవనోపాధి భద్రతను పెంపొందించడం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశమని ఏపీవో ఆనంద్ మోహన్ తెలిపారు. మండలంలోని వడ్లమూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఎన్ఆర్‌జీఎస్ మేట్ల సమావేశంతో పాటు శిక్షణ నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని వడ్లమూడి, గొడపాలెం, గరువుపాలెం ప్రాంతాలకు చెందిన మేట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏపీవో ఆనంద్ మోహన్ జాబ్ కార్డు పొందే విధానం, వాటి ఉపయోగం తదితర అంశాల్ని వివరించారు. టెక్నికల్ అసిస్టెంట్ ఎస్. సంపత్, కార్యదర్శి వైపీపీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా

కొనసాగుతున్న క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

రేపల్లె రూరల్: యువతలో క్రీడానైపుణ్యం వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు పట్టణంలో రసవత్తరంగా సాగుతున్నాయి. ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం క్రీడాకారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో కబడ్డీ, వాలీబాల్ పోటీలను బాలికలు, బాలుర విభాగంలో వేర్వేరుగా నిర్వహించారు. క్రీడా మైదానంలో క్రీడాకారులకు అవసరమైన అన్నిరకాల మౌలిక సదుపాయాలు సచివాలయ అధికారులు ఏర్పాటు చేశారు. పోటీలను మున్సిపల్ కమిషనర్ విజయసారథి, సచివాలయ ఉద్యోగులు పర్యవేక్షించారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

కర్లపాలెం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తుందని వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో భాగంగా మండల స్థాయి క్రికెట్ పోటీలు తుమ్మలపల్లి సచివాలయం పరిధిలోని నర్రావారిపాలెం గ్రామంలో గురువారం హోరాహోరీగా జరిగాయి. ఈ క్రికెట్ పోటీలను యల్లావుల ఏడుకొండలు పేరలిపాడు సర్పంచ్ కాగిత కరుణకుమారితో కలసి ప్రారంభించారు. ఈ పోటీలలో మొత్తం 5 జట్లు పోటీ పడగా బుద్దాం క్రికెట్ జట్టుపై తుమ్మలపల్లి జట్టు, కర్లపాలెం జట్టుపై పెదపులుగువారిపాలెం జట్టు, గణపవరం జట్టుపై పెదగొల్లపాలెం, దమ్మనవారిపాలెం జట్టుపై ఏట్రవారిపాలెం క్రికెట్ జట్టు విజయం సాధించాయి.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

కర్లపాలెం: గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ యారం వనజ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ వనజ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఉన్న నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు దేశానికి పట్టుకొమ్మలు లాంటివన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాలను బలోపేతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యారం వనజ

వేడుకగా భావనారుషి కల్యాణం

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు–అద్దేపల్లి తిరువీధుల వారి రామ మందిరంలో భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి కల్యాణ మహోత్సవం, అఖండ దీపారాధన గురువారం నిర్వహించారు. స్వామి వారి కల్యాణం వీనులవిందుగా సాగింది. పూజా కార్యక్రమాలను తిరువీధుల కాళిదాసు సిద్ధాంతి శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం స్వామి వారి నగరోత్సవం, పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం పేదలకు నిత్యావసరాల కిట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం జరిగింది.

నేడు ఓలేరులో జగనన్న ఆరోగ్య సురక్ష

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం ఓలేరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ క్యాంప్‌లో రెండు పీహెచ్‌సీల నుంచి వైద్యులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్ నుంచి ఇరువురు స్పెషలిస్టులు, కంటి వైద్య నిపుణులు పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు నీలా సాంబమ్మ, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నిత్య కృషితోనే విజయ సాధన

గుంటూరు రూరల్: నూతన ఆవిష్కరణల్లో విద్యార్థుల ఆలోచనలు విజయం సాధించే వరకు నిత్యం కృషి చేయాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో గురువారం డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్, ఇన్నోవేషన్ డిజైన్ అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను బెంగుళూరుకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థ ఐబీఎం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా కాగ్నిటివ్ డేటా సైంటిస్ట్ దాసరి నేహకృష్ణ పాల్గొన్నారు. విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు వాటి ప్రాధాన్యత, ఉపాధి అవకాశాలను వివరించారు. కళాశాల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నూతన ఆవిష్కరణలను గురించి సమాజాభివృద్ధికి ఉపయోగకరంగా ఆలోచన చేయాలని తెలిపారు. నేహకృష్ణ మాట్లాడుతూ యంత్రాలు, వస్తువులు, వివిధ నూతన పరికరాలకు వాటి డిజైన్ విశేష ఆకర్షణగా నిలవాలని సూచించారు. నూతన ఆవిష్కరణల నమూనాల తయారీలో రూపొందించే డిజైన్ ప్రాథమిక అంశంతో పాటూ విజయానికి ప్రాధాన్యత సంతరించుకుంటుందని తెలిపారు. ఇన్నోవేషన్ హబ్‌గా భారత దేశాన్ని నిర్మించాలనే దృఢ సంకల్పంతో విద్యార్థుల ఆలోచన ఉండాలని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ స్వర్ణ, డాక్టర్ ఎస్. రాధిక, డాక్టర్ కె. కార్తీకపవన్, డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

22ను సెలవు దినంగా ప్రకటించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఈనెల 22ను సెలవు దినంగా ప్రకటించాలని హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఆర్.వి. ప్రసాదరెడ్డి, ఎం. కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భరతజాతికి ఆదర్శ ప్రాయుడు, కుటుంబ వ్యవస్థకు మూల పురుషుడైన శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవం, ప్రాణ ప్రతిష్ట హిందువుల చిరకాల స్వప్నమని, 500 ఏళ్ల కల సాకారమవుతున్న రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన మత స్వాతంత్ర్యపు హక్కును స్వేచ్ఛగా పాటించే అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

శేకూరులో వీవీఐటీ సేవా శిబిరం ప్రారంభం

చేబ్రోలు: మండలంలోని శేకూరులో వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల (వీవీఐటీ) ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా శిబిరం గురువారం ప్రారంభమైంది. ఈ నెల 24 వరకు వారం రోజుల పాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, మెడికల్ క్యాంప్‌లను నిర్వహించనున్నారు. మొదటి రోజు మహిళా సాధికారత, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంతో పాటు గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ బాలికల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఆడపిల్లలను గౌరవించాలని, వారిని చదువుల తల్లిగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. సమాజంలో దేనికీ తీసిపోరు అని రుజువు చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. యుక్త వయుస్సులో కలిగే ఆకర్షణలు లక్ష్యాలను దూరం చేస్తాయని , వాటికి యువత దూరంగా ఉండాలని చెప్పారు. ఉన్నత స్థానాల్లో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు బేటీ బచావో.. బేటీ పడావో నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో ఐ.ఎల్.జె.భక్తసింగ్, బి.వి.సతీష్ కుమార్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీలో తహసీల్దారు గోపాలకృష్ణ, పీవో తదితరులు

శివాలయం ప్రతిష్ఠోత్సవం ఆహ్వాన ప్రతుల ఆవిష్కరణ

తెనాలి: గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలంలోని వేమవరం గ్రామంలో కోటీ ఒక్క లింగాల శివాలయం ప్రతిష్ఠోత్సవం మహోత్సవం గోడపత్రికలను గురువారం తెనాలిలో ఆవిష్కరించారు. స్థానిక బాలాజీరావు పేటలో వివిధ హిందూ సంస్థలు, సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ శివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా వేమవరంలో కోటీ ఒక్క లింగాల మహాకాళి సహిత మహాకాలేశ్వరస్వామి శివాలయాన్ని వేమవరంలో నిర్మించినట్టు తెలిపారు. అయోధ్య రామమందిర ప్రతిష్ఠ ముహూర్తానికే అంటే ఈ నెల 22న మధ్యాహ్నం 12.20 గంటలకు ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని మనసారా లింగాలను తిలకించి, ఆ మహాదేవుని అన్నప్రసాదాన్ని స్వీకరించి, ఉచితంగా రుద్రాక్షను పొంది తరించాలని నల్లగొర్ల శ్రీనివాసరావు, వేమ సురేష్‌బాబు భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యలవర్తి సాంబశివరావు, కుర్రా శ్రీనివాసరావు, నల్లగొర్ల నాగేశ్వరరావు, తుల్లిమిల్లి పోతురాజు, ఓలేటి ప్రతాప్, సమ్మిడి నారాయణ, ఆర్ఎంపీ కోటేశ్వరరావు, పెరుగు మల్లికార్జునరావు, వేల్పుల గంగాధర్, ఎం.రమాదేవి, కొత్తగొర్ల శ్రీనివాసరావు, రాజకొండ మురళీకృష్ణ, మునిపల్లి వెంకట రఘునాథరావు, బాణావత్ బాలునాయక్ పాల్గొన్నారు.



ఆహ్వాన గోడ పత్రికల ఆవిష్కరణ

మొబైల్ షాపులో చోరీ

బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

మంగళగిరి: నగర పరిధిలో మొబైల్ షాప్‌లో గత బుధవారం రాత్రి చోరీ జరిగింది. మంగళగిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధిలో కాజాకు చెందిన చల్లా వేణుగోపాల్‌రెడ్డి సెల్ ఫోన్ షాప్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా షట్టర్ తాళాలు పగలకొట్టి ఉండటాన్ని గమనించాడు. చోరీ జరిగిందని గుర్తించి, రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుకాణంలో సుమారు రూ.50వేల విలువైన సెల్ ఫోన్స్, ఇయర్ ఫోన్స్ చోరీ జరిగినట్లు అందులో పేర్కొన్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

భట్టిప్రోలు: మండలంలోని గ్రామాలలో నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించి తదనుగుణంగా బడ్జెట్లు రూపొందించాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. భట్టిప్రోలు మండలం పరిషత్ కార్యాలయంలో గురువారం అభివృద్ధి ప్రణాళిక తయారీ (జీపీడీపీ) శిక్షణా కార్యక్రమంపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మెరుగైన అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ గైడెన్స్ ప్రకారం ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి బడ్జెట్లు ఆమోదించుకున్న తరువాత సంబంధిత వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు కె. లీలాప్రసాద్, వక్కలగడ్డ సురేష్, కె.అనీల్, ఎ. సాయికుమార్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న లలిత కుమారి

పంచాయతీల అభివృద్ధికి సహకరించండి

నగరం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలని ఎంపీపీ చింతల శ్రీ కృష్ణయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో కల్పించాల్సిన మౌలిక వసతులపై ప్రణాళికలను రూపొందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేసి ప్రణాళికలను తయారుచేసి నిర్దేశించిన సమయంలోపు అందజేయాలన్నారు. ప్రణాళికల ఆధారంగా పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణయ్య

22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

- ఓటర్ల జాబితా పునఃపరిశీలించుకోవాలి
- ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్

ప్రత్తిపాడు: తుది ఓటర్ల జాబితాను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు గుంటూరు ఆర్డీవో, ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్పులు, చేర్పులపై వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ చేసిన తరువాతే నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ఓటర్ల ముసాయిదా జాయితా ఇప్పటికే ప్రచురించామని తెలిపారు. జాబితాలు బీఎల్‌వోలు, పోలింగ్ బూత్‌లు, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. మరోసారి ఆయా పార్టీల నాయకులు, ఓటర్లు జాబితాలను పునఃపరిశీలించుకుని ఆయన సూచించారు. అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో ఇద్దరు వ్యక్తులు ఓట్లు తొలగింపునకు 63 దరఖాస్తులు పెట్టారని.. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు తహసీల్దార్ జి. సిద్ధార్థ ఎస్ఐకు పిర్యాదు చేసినట్లు సమావేశంలో నాయకులకు తెలిపారు. అనుమానాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ఓటర్ల జాబితాను తయాలు చేస్తున్నామని శ్రీకర్ స్పష్టం చేశారు.

24 గంటలూ పని చేయాలి

ప్రత్తిపాడు బస్టాండు సమీపంలో సివిల్ సప్‌లెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోలు బంకును గుంటూరు ఆర్డీవో పి. శ్రీకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాత్రి సమయాల్లో పెట్రోలు కొట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ కొందరు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఇరవై నాలుగు గంటలూ పెట్రోలు బంకు పనిచేయాలని, వినియోగదారులను ఇబ్బందులు పెట్టవద్దని బంకు ఇన్‌చార్జి అలేఖ్యకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పక్కనే ఉన్న సివిల్ సప్లై గోడౌన్‌లో తనిఖీలు చేసి, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వెంట తహసీల్దార్ జి. సిద్ధార్థ తదితరులున్నారు.



సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న శ్రీకర్

ముట్లూరులో మందుబాబుల వీరంగం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో మందుబాబులు వీరంగం సృష్టించారు. బుధవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పూటుగా మద్యం తాగి గ్రామంలోని సచివాలయం–1, సచివాలయం -2 కిటికీల అద్దాలు ధ్వసం చేశారు. అంతటితో ఆగకుండా గ్రామంలో నిలిపి ఉంచిన ఎండీయూ వాహనం అద్దాలను సైతం పగలగొట్టారు. ఇది మందుబాబుల పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా గురువారం ఉదయం సచివాలయం తీసేప్పటికి అద్దాలు పగిలిఉండటం, గాజు పెంకులు చెల్లాచెదురుగా పడి ఉండటంతో పంచాయతీ కార్యదర్శి బి. సుబ్బారావు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.



పగలగొట్టిన సచివాలయం కిటికీ అద్దాలు

పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులు కల్పించాలి

తెనాలిరూరల్: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిసతులు ఉండేలా చూడాలని అస్యూర్డ్ మినిమమ్ ఫెసిలిటీస్(ఏఎంఎఫ్) జిల్లా నోడల్ అధికారి, సర్వ శిక్షా అభియాన్ కో–ఆర్డినేటర్ జి. విజయలక్ష్మి అధికారులకు సూచించారు. తెనాలి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులపై గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పోలింగ్ బూత్‌ల వివరాలు తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో విద్యుత్, తాగునీటి సదుపాయం, దివ్యాంగుల కోసం ర్యాంపు, మరుగుదొడ్లు వంటి వసతులు ఉండేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల్లో 17 ర్యాంపులు, 21 మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సి ఉందని అధికారులు నోడల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. తెనాలి, కొల్లిపర తహసీల్దార్లు కె. రవిబాబు, జి. నాంచారయ్య, మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావు, విద్యాశాఖ అధికారులు మేకల అలక్ష్మీనారాయణ, వి. జయంత్‌బాబు, జి. సాల్మన్‌రాజు, వి. ఝాన్సీలత, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న నోడల్ అధికారి విజయలక్ష్మి

ఇంటి పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ఫిరంగిపురం: ప్రతి ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి(ఎస్‌యూఓ) బి.చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న స్పందన అనే మహిళకు డెంగీ జ్వరం వచ్చి గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఆయన గురువారం డెంగీ వచ్చిన మహిళ ఇంటి చుట్టుపక్కల 80 గృహాల వారి వివరాలు సిబ్బంది ద్వారా సేకరించారు. వారికి రక్తపూత పరీక్షలు చేశారు. డెంగీ వ్యాధి లక్షణాలను వివరించారు. కొన్ని గృహాల వద్ద ఎబెట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఎస్‌యూఓ వెంట సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్ఎస్ కె.సుదర్శనరాజు, హెచ్ఏలు బాబురావు, బాబావలి, కిషోర్, ఆశా కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లారీ పార్కింగ్ విషయంలో ఘర్షణ

తాడేపల్లిరూరల్ : పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు వద్ద లారీ పార్కింగ్ విషయంలో ఇద్దరు ఓనర్ల మధ్య గురువారం ఘర్షణ చోటుచేసుకోగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలకంపాడుకు చెందిన బత్తుల మోహనరావు తన ఇంటి ముందు రహదారి వెంబడి లారీని నిలుపదల చేశాడు. అదే ప్రాంతంలోని గంగాధర శ్రీను అతని లారీ వెనుకనే తన లారీని పార్క్ చేశాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. లారీ తీయడానికి వచ్చిన గంగాధర శ్రీనును బత్తుల మోహనరావు కర్రతో విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో వారిద్దరి కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోవడంతో.. ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో శ్రీను కొడుకు సాయి తలకు తీవ్ర గాయమైంది. అతడిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. సాయి తాడేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఫిర్యాదు చేస్తుండగా బత్తుల మోహనరావు బంధువుల మరోసారి అతని తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డారు. సంఘటనపై ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.